క్లుప్తంగా

గుంతలు పూడ్చిన అధికారులు



జేసీబీతో గుంతలను పూడ్చుతున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు పాతపట్నం నుంచి మెళియాపుట్టి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు పాడైపోయి గుంతలు ఏర్పడంతో వాహనదారులకు ప్రమాదకరంగా ఏర్పడింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు జేసీబీతో రహదారికి ఇరువైపులా ఏర్పడిన గుంతలను మంగళవారం పూడ్చారు. అధికారులు స్పందించడంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు



జోడూరులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని 12,100 పశువులకు టీకాలు వేస్తున్నామని, గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.కరుణాకరరావు సూచించారు. మండలంలోని జోడూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆరు నెలల పైబడిన ప్రతీ పశువుకు ఈ టీకాలు వేయించాలని, సూడిద ఉన్న పశువులకు కూడా ఈ టీకాలు వేయించవచ్చన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పశువైద్యురాలు కె.మౌనిక, బెజ్జిపురం కూర్మారావు, వాకాడ గణేష్, జీరు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

పాతపట్నం: నియోజకవర్గంలోని చదువుకున్న దివ్యాంగ విద్యార్థులు అవసరమైన ఉపకరణములను సద్వినియోగం చేసుకోవాలని ఎండీవో హెచ్.వి.రమణమూర్తి సూచించారు. స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 110 మంది దివ్యాంగులు హాజరయ్యారు. అర్హులైన వారికి పరికరాలను నమోదు చేసుకున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందరావు, రాంబాబు, మణికుమార్, హెచ్‌ఎం కృష్ణారావు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరు గ్రామ పంచాయతీలో మంగళవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మురుగు నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సర్పంచ్ పడాల కృష్ణవేణి ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. కాలువల్లో తొలగించిన చెత్తను డప్పింగ్ యార్డుకు తరలించారు.

ఆదివాసీ వాయిద్య పరికరాలు పంపిణీ



ఆదివాసీలకు వాయిద్య పరికరాలను అందజేస్తున్న ఏసీవో నాగరాజు

మెళియాపుట్టి: మండలంలోని కేరసింగి పంచాయతీ డాబారు గ్రామంలో ఆదివాసీ వాయిద్య పరికరాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు మంగళవారం పంపిణీ చేశారు. గిరిజన సాంప్రదాయాలను కాపాడాలని, పండగలు, పూజలు నిమిత్తం పూర్వం ఆదివాసీ వాయిద్య పరికరాలు ఆదివాసులు ఉపయోగిస్తారని అసోసియేషన్ ఏసీవో నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో కల్యాణి, హరిచంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేరుకే స్మార్ట్..!



స్మార్ట్ రేషన్‌కార్డులు

- తప్పుల తడకగా రేషన్ కార్డులు
- ఆందోళనలో లబ్ధిదారులు
- ఎలా సరి చేసుకోవాలో తెలియని పరిస్థితి

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్‌కార్డులు తప్పులతడకగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రచారానికి ఇస్తున్న ప్రాధాన్యత, స్మార్ట్‌కార్డుల ముద్రణ విషయంలో లేకపోవడంతో ముద్రణ విషయంలో తప్పులు నమోదయ్యాయి. దీంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ఇంటి పేర్లు, ఇంటి నంబర్లు, ఊరు పేర్లు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు సరిగా లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత కార్డులో ఉన్నవారి పేర్లన్నీ కొత్తగా జారీ చేసిన కార్డులో లేకపోవడం దారుణమని వాపోతున్నారు. దీంతో వీటిని సరిచేయించుకోవడానికి కార్డుదారులు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలాంటి స్మార్ట్ రేషన్ కార్డులను చూసి ప్రభుత్వం కార్డుల ముద్రణ విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరి పేర్లు స్మార్ట్ రేషన్‌కార్డులపై లేకపోవడంతో రాబోయే రోజుల్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడడానికి అర్హత లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. పాతపట్నంలో నీలమణిదుర్గ కాలనీలోని కాలనీ పేరునే తప్పుగా నమోదు చేశారు. పాతపట్నం కుమ్మరివీధికి చెందిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో కుటుంబ పెద్దతో సంబంధంలో ఇతరులు అని మార్చేయడంపై కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఇంకా ఆప్షన్ రాలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. తప్పుల సవరణను ఉచితంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండలం	రేషన్ షాపుల సంఖ్య	కార్డుదారులు
పాతపట్నం	46	19,929
మెళియాపుట్టి	44	16,413
కొత్తూరు	60	22,122
హిరమండలం	31	11,965
ఎల్.ఎన్.పేట	36	10,775



దాసరి అప్పలనరసమ్మ స్మార్ట్ కార్డు



స్మార్ట్ కార్డులో కుటుంబ పెద్దతో సంబంధం ఇతరులు అని ముద్రించారు

తప్పులతో కార్డు వచ్చింది



ఇటీవల ఇచ్చిన స్మార్ట్ రేషన్‌కార్డు మా అమ్మ దాసరి నరసమ్మ పేరున వచ్చింది. అందులో మా కుటుంబ సభ్యులతో ఆమెకు సంబంధాన్ని ఇతరులు అని నమోదు చేశారు. మా కార్డులో రిలేషన్ సరిచేయాలని సచివాలయానికి వెళ్తే, సరి చేయడానికి ఆప్షన్ రాలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మార్ట్‌కార్డులో తప్పులు సరిచేసే చర్యలు తీసుకోవాలి. – **దాసరి వెంకట రమణ,** కుమ్మరివీధి, పాతపట్నం

తప్పులు నమోదయ్యాయి



నూతనంగా ఇచ్చిన స్మార్ట్‌కార్డుల్లో పేర్లు, ఇంటి పేర్లు, వయస్సు, పుట్టిన తేదీ, లింగము, కుటుంబ పెద్దతో సంబంధం వంటి పేర్లు తప్పులుగా నమోదయ్యాయి. వీటిని సరిచేసే చర్యలు తీసుకోవాలి.

– **అమర ఉష,** కాగువాడ గ్రామం, పాతపట్నం మండలం

కార్డులు సరిచేస్తాం



ఇటీవల నూతనంగా స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయడం జరిగింది. వాటిలో తప్పులను సరిచేయడానికి అవకాశం ఉంది. ముందుగా రేషన్ కార్డులు తీసుకోవాలి. అందరి కార్డుల్లో పేర్లు, ఇతర సమస్యలు సరిచేస్తాము. కార్డుదారులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

– **ఎస్.ప్రసాదరావు,** తహసీల్దార్, పాతపట్నం

తీరని యూరియా వెతలు



యూరియా కోసం బారులుతీరిన రైతులు

నరసన్నపేట: యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఇంకా డిమాండ్ అలానే ఉంది. నరసన్నపేటలోని ఒక ప్రైవేటు డీలర్‌కు యూరియా సోమవారం సాయంత్రం రాగా రైతులు అధిక సంఖ్యలో మంగళవారం ఉదయానికే షాపు వద్దకు చేరుకున్నారు. పరిస్థితి గమనించిన వ్యవసాయాధికారి సూర్యకుమారి ఒక్కో రైతుకు భూమి ఆధారంగా యూరియా స్లిప్పులు ఇచ్చారు. దీని ప్రకారం ప్రైవేటు డీలరు యూరియా పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పడిగాపులు కాశారు.

పరామర్శ



ఆమదాలవలస: మాజీ ఎంపీపీని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్



హెచ్‌ఎం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మార్పు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మంగళవారం పరామర్శించారు. వంశధార నదిలో ప్రమాదవశాత్తు మునిగి హెచ్‌ఎం మరణించిన విషయం తెలిసిందే. దీంతో గోపాలపెంటలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, కనపల శేఖర్, బొబ్బాది ఈశ్వరరావు, సురంగి నర్సింగరావు తదితరులు ఉన్నారు.

ఆమదాలవలస: మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద్ గోపాల్ తల్లి బొడ్డేపల్లి గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆమదాలవలసలో మంగళవారం పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాంత్ తదితరులు ఉన్నారు.

రైతులను సంక్షోభంలోకి నెట్టారు

హిరమండలం: కూటమి ప్రభుత్వం రైతులను సంక్షోభంలోకి నెట్టిందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. యూరియా కోసం రైతులు వ్యయ, ప్రయాసలకు గురవుతుండడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు మేలుచేసే చర్యలు తీసుకోవాలని కోరారు.

అవగాహన సదస్సు నేడు

హిరమండలం: గ్రామీణ ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి విష్ణుప్రసాద్ పండా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మెడికవర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్యంలో ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల పాత్ర కీలకమని.. అందులో భాగంగా అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విధిగా ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు హాజరవ్వాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జలుమూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో సీహెచ్ వంశీప్రియ అన్నారు. మండలంలోని అంధవరం, దరివాడలో పోషణ్ మహాన్ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించి అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. చిరుధాన్యాలు వలన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ ప్రసన్న, పర్యవేక్షకురాలు సీతారత్నం పాల్గొన్నారు.

కలుపు ఉంటే.. కలదు నష్టం..!



ఎల్ఎన్‌పేటలో కలుపు తీస్తున్న రైతులు

- సాగులో నివారణ అత్యంత కీలకం
- యాజమాన్య పద్ధతులతో అధిక ప్రయోజనాలు

హిరమండలం: వరిసాగులో రైతులకు కలుపుతీత అత్యంత కీలకమైనది. సకాలంలో కలుపుతీత వల్ల నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటుంది. కలుపును వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరిపంటలో కలుపు నివారించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాగుచేసే పంటల్లో పెరిగే ఇతర గడ్డి మొక్కలనే కలుపు అంటారు. సాగుభూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంటకంటే త్వరితగతిన పెరిగి పోషకాలు, ఎరువులను స్వీకరించి దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపు నివారించకుంటే తెగుళ్ల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏకవార్షిక గడ్డి జాతులు ఉంటాయి. వాటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తూ క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపు తీయించేవారు. కూలీల కొరత, రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. దీనివల్ల కలుపు నివారణకు అనేక మందులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా రసాయన, క్రిమి సంహారక మందులను అధికంగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏవిధమైన మందులు ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే కలుపును పూర్తిగా నిర్మూలించి, అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల కలుపు నివారణ మందులు అందుబాటులో ఉన్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమి సంహారక మందులు ఎంత మోతాదులో, ఏ సమయంలో ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలను తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగకపోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందులను ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించరాదని, కలుపు నివారణకు ఎల్లప్పుడూ ఒకే మందు వాడరాదని అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటినప్పటి నుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి.

– **బి.సంధ్య,** వ్యవసాయాశాఖాధికారి, హిరమండలం

జలుమూరు: కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గాయత్రి దేవిగా దర్శనం



బూర్జ: కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



పాతపట్నం: గాయత్రి దేవిగా నీలమణిదుర్గ



సారవకోట: బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు

పాతపట్నం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు మంగళవారం గాయత్రి దేవిగా స్వరూపంగా పూజలు అందుకున్నారు. దేవాతా హోమాలు, అమ్మవారి మూల మంత్ర హోమాలను అమ్మవారి ఆవరణలోని యాగశాలలో నిర్వహించారు.

బూర్జ: మండలంలోని బూర్జ గ్రామంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రెండోరోజు గాయత్రి దేవి రూపంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస వర్తక సంఘం, శ్రీదేవి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, పురజనులు పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మంగళవారం బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి 9 మంది దంపతులచే కుంకుమార్చనలు, ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.

శ్రీముఖలింగంలో కుంకుమ పూజలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని రెండో రోజు మంగళవారం అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



హిరమండలం: వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



సరుబుజ్జిలి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని తదితరులు

సరుబుజ్జిలి: మహిళలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహితి ప్రియదర్శిని సూచించారు. మండలంలోని చినకాగితాపల్లి గ్రామంలో స్వస్థ్ నారీ – సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. మహిళ ఆరోగ్యంపై కుటుంబ సంక్షేమ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ వైద్యాధికారి సీహెచ్‌వో మోహనరావు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిరమండలం: మహిళలు అనారోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికుమార్ సూచించారు. హిరమండలం సచివాలయం-3 పరిధిలోని సుబలాయి గ్రామంలో స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సకాలంలో వైద్యసేవలు పొందాలన్నారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. వర్షాకాలం దృష్ట్యా పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, హెడ్ నర్సు ఆదిలక్ష్మి, రోజా రమణి, రాజు, సీతారామరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఆమదాలవలస: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ గురుప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సత్యసాయి యువ వికాస్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదళ్ కో–ఆర్డినేటర్ లలిత, టౌన్ యూత్ కో–ఆర్డినేటర్ దామోదర పట్నాయక్, సత్యసాయి సేవా సమితి వేణంపేట ప్రతినిధి యు.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో సమస్యలు పరిష్కారం



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ దాసు నాయుడు

కొత్తూరు: గ్రామ సభలు నిర్వహించి తద్వారా పంచాయతీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చునని రిసోర్స్ పర్సన్ కె.దాసు నాయుడు తెలిపారు. మండలంలోని మహసింగిలో వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పరిపాలన, సమస్యల పరిష్కారంపై శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. రాజ్యాంగానికి లోబడి పరిపాలన చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలు చెప్పిన సమస్యలను గుర్తించాలన్నారు. సమస్యలను అధికారులు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పంచాయతీలో పనిచేస్తున్న పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బంది వివరాలను తెలిపారు. ఆయా శాఖ అధికారులు పంచాయతీలో చేయవలసిన విధులు వివరించారు. శిక్షణలో సీతంపేట, భామిని మండలాలకు చెందిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలి

కొత్తూరుమెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీకి ఆనుకొని ఉన్న వంశధార వరద కాలువ గట్టుపై అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు సోమవారం కోరారు. అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.